# రేవంత్‌కు మద్దతుగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి కామెంట్లు

హైదరాబాద్ , జూన్ 28:కోమటిరెడ్డి బ్రదర్స్ మధ్య విభేదాలు ఉన్నాయా అనే ప్రశ్న తాజాగా ఉత్పన్నం అవుతోంది. ఎందుకంటే ఆదివారం నాడు అన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి రేవంత్ విషయంలో కాంగ్రెస్ అధిష్టానంపై మండిపడగా.. తమ్ముడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రేవంత్‌కు మద్దతుగా మాట్లాడటమే దీనికి కారణం.

పీసీసీ చీఫ్‌గా ఎంపీ రేవంత్ రెడ్డి ఎంపికపై ఎంపీ కోమటిరెడ్డి స్పందించిన తీరు పార్టీలోనే కాదు ఇతర రాజకీయ పక్షాల్లోనూ చర్చనీయాంశం అయ్యింది. రెండున్నర సంవత్సరాలుగా ఇదిగో? అదిగో అంటూ ఊరిస్తూ వచ్చిన పీసీసీ అధ్యక్ష ఎంపికపై అధిష్టానం నిర్ణయం తీసుకోగానే ఎంపీ కోమటిరెడ్డి డబ్బులు తీసుకొని పదవి ఇచ్చారని, ఇంచార్జ్ అమ్ముడుపోయారని ఆరోపించారు. తాను ఇక గాంధీభవన్ మెట్లే ఎక్కను అంటూ విమర్శలు చేశారు.

# అశోక్ హయాంలో మాన్సాస్ ట్రస్ట్‌లో అక్రమాలు!

హైదరాబాద్ , జూన్ 28:టీడీపీ సీనియర్ నేత, మాన్సాస్ ట్రస్టు ఛైర్మన్ అశోక్ గజపతిరాజుపై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తన విమర్శల దాడిని కొనసాగిస్తున్నారు. అస్తవ్యస్త పాలనతో మాన్సాస్ విద్యా సంస్థలను భ్రష్టు పట్టించిన అసమర్థుడు అశోక్ గజపతి రాజు అని వ్యాఖ్యానించారు. ఏళ్ళ తరబడి తప్పుడు డేటా అప్‌లోడ్ చేసినందునే ప్రభుత్వం నుంచి మాన్సాస్‌కు ఆర్థిక సాయం అందలేదన్నారు. ఛైర్మన్ పదవి అతనికి అలంకారం మాత్రమేనని బాధ్యత కాదన్నారు.

ఛైర్మన్‌గా అశోక్ ఏళ్ళ తరబడి మాన్సాస్ సిబ్బంది పని తీరును పర్యవేక్షించకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఫలితంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. సమయానికి సంచయిత జోక్యం చేసుకుని వారికి డిగ్రీలు వచ్చేలా చేశారని తెలిపారు. లేకుంటే అశోక్ నిర్లక్ష్యానికి విద్యార్థుల జీవితాలు బలైపోయేవి అని పేర్కొన్నారు. మాన్సాస్ ట్రస్ట్‌కు అశోక్ కనీసం లీగల్ హెడ్‌ను నియమించలేదని విమర్శించారు. ఒక కేసులో ట్రస్ట్ తరఫున వాదించే న్యాయవాది లేక కోర్టు ఏకపక్షంగా తీర్పు చెప్పిందన్నారు. ఫలితంగా ట్రస్ట్ 13 కోట్లు నష్టపోయిందని, ట్రస్ట్‌కు చెందిన భూముల్లో ఇసుక తవ్వకాలను కారుచౌకగా పచ్చ గ్యాంగ్‌కు కట్టబెట్టారని ఆరోపించారు.

అశోక్ హయాంలో మాన్సాస్ ట్రస్ట్‌కు వాటిల్లిన నష్టం అపారం అని అన్నారు. ఆ నష్టాన్ని ఇంకా అంచనా వేసే పనిలో అధికారులు ఉన్నారని చెప్పారు. ఇదే ఏ ప్రైవేట్ సంస్థలోనో జరిగితే తీవ్ర నిర్లక్ష్యం, ఉల్లంఘనలు, ఆర్థిక అవతవకలకు పాల్పడిన ఆరోపణలతో అశోక్‌ను పీకి పారేసేవారని వ్యాఖ్యానించారు. అది దివాణా పాలన కదా అడిగే దిక్కే లేదన్నారు. మాన్సాస్ ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై ఫోరెన్సిక్ ఆడిట్‌కు చాలా కాలం పడుతుందన్నారు. అశోక్ చట్టవిరుద్ధ చర్యలపై ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని తెలిపారు. దొంగలు ఆనవాళ్ళను ఎలా చెరిపేస్తారో అధికారులకు బాగా తెలుసన్నారు. అశోక్ ముసుగు తీసి అతని అక్రమాలను బహిర్గతం చేసే ఆధారాలు వారి కళ్ళ ముందే ఉన్నాయని విజయసాయి అన్నారు.

ఇంత నీచమైన పనులు రాజ వంశీకులు చేయాల్సినవేనా అశోక్? అంటూ ప్రశ్నించారు. సాక్ష్యాత్తు అప్పన్న ఆస్తులను బాబు కోసం ప్రసాదంలా పంచిపెట్టారని ఆరోపించారు. 748 ఎకరాల విలువ 10 వేల కోట్ల పైనే ఉందన్నారు. ఆలయ రికార్డుల నుంచి ఆ భూముల వివరాలు తొలగించడమంటే సాధారణ కుంభకోణం కాదన్నారు. స్కాముల సముద్రంలో ఇది నీటి బొట్టేలనని, ఇంకా చాలా వస్తాయి బయటకు విజయసాయి తెలిపారు.

# బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా



నిజామాబాద్, జూన్ 28: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా చిత్రా మిశ్రా బాధ్యతలు చేపట్టారు. సోమవారం కలెక్టరేట్లో ఇంతవరకు జిల్లాలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేసిన బీఎస్ లత నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమె 2019 బ్యాచ్‌కు చెందిన తెలంగాణ క్యాడర్ ఐఏఎస్ అధికారి. ఇంతకుముందు చిత్రా మిశ్రా నాగర్ కర్నూల్ జిల్లాలో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేశారు. ఆమెకు నిజామాబాద్ మొదటి పోస్టింగ్. కాగా, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ చిత్రా మిశ్రాకు పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రాములు, డీపీవో జయసుధ, ఏవో సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో భారీ వర్షం

**-పలు మండలాల్లో మోస్తరు వాన**
**అపరాలు, వాణిజ్య పంటలకు ప్రాణం**
**48, 578 ఎకరాలకు చేరిన సాగు**

ఖమ్మం, జూన్ 28: ఖమ్మం నగరంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పలు మండలాల్లో ఓ మోస్తరు వాన కురిసింది. దీంతో అపరాలు, వాణిజ్య పంటలకు ప్రాణం పోసినట్లయింది. రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి దాదాపుగా 30 రోజులు కావస్తున్నప్పటికీ వరదలా పారే వర్షం మాత్రం కురవలేదు. అడపాదడపా వచ్చే వర్షాలను ఆసరగా చేసుకొని జిల్లా రైతులు సాగు ప్రక్రియ ప్రారంభించారు. ఎట్టకేలకు ఆదివారం సాయంత్రం నుంచి జిల్లా వ్యాప్తంగా దట్టమైన మేఘాలు అలుముకున్నాయి. తద్వారా రాత్రి వేళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దాదాపు 40 నిమిషాల పాటు నిరంతరాయంగా కురిసిన వర్షానికి నగరం తడిసి ముద్దయింది. దీంతో ఆయా కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నగరంలోని బస్టాండ్ సెంటర్, మయూరిసెంటర్, పీఎస్ఆర్ రోడ్డు, కమాన్‌బజార్, చర్చికంపౌండ్ ఏరియాల్లోని ప్రధాన వీధుల్లోకి వరద నీరు వచ్చి చేరింది. నగరంతోపాటు శివారు మండలాలైన రఘునాథపా లెం, చింతకాని, కొణిజర్ల, ఖమ్మం రూరల్లో భారీ వర్షమే కురిసింది. రెండు రోజుల నుంచి అక్కడక్కడా కురుస్తున్న వర్షాలకు సాగు చేసిన అపరాలు, పత్తి పంటలకు ప్రాణం పోసినట్లయింది. నేటి వరకు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 48,578 ఎకరాల్లో రైతులు విత్తనాలు విత్తుకున్నారు. వరి నార్లు పోసుకొని ఉన్నారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల పంటలు కలిపి 5,96 149 ఎకరాల్లో సాగు కావచ్చని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేసింది. అందులో భాగాంగా ఇప్పటి వరకూ వరి నార్లు 4,124 ఎకరాలు, మక్క సాగు 12 ఎకరాలు, పెసర 5,228 ఎకరాలు, మినుము 15 ఎకరాలు, కంది 192 ఎకరాలు, వేరుశనగ 3ఎకరాలు, పత్తి 36,523 ఎకరాలు, చెరుకు 826 ఎకరాల్లో సాగు మొదలైంది. 16,965 ఎకరాల కోసం వరి నారుమళ్లు పోసుకున్నారు. రానున్న వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో సాగు పనులు మరింత ముమ్మరం కానున్నాయి.

# మన భాషల పరిరక్షణకు ప్రజా ఉద్యమం అవసరం: ఉపరాష్ట్రపతి శ్రీ ఎం. వెంకయ్యా నాయుడు

హైదరాబాద్ , జూన్ 28:మన భాషా సంప్రదాయాల ప్రయోజనాలను భవిష్యత్ తరాలకు అందించడానికి, ప్రభుత్వ ప్రయత్నాలకు బాసటగా నిలుస్తూ భాషలను పరిరక్షించడానికి ప్రజఉద్యమం అవసరాన్ని ఉపరాష్ట్రపతి శ్రీ ఎం. వెంకయ్య నాయుడు ఈ రోజు నొక్కి చెప్పారు.

తరాలు మరియు భౌగోళిక ప్రాంతాలలో ప్రజలను ఏకం చేయడానికి భాష చాల శక్తివంతమైనదని స్పష్టం చేసిన శ్రీ వెంకయ్య నాయుడు, మన భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలను పరిరక్షించడానికి, సంపన్నం చేయడానికి, ప్రచారం చేయడానికి సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

'రాష్ట్రేతర తెలుగు సమాఖ్య' 6వ వార్షిక సదస్సులో శ్రీ వెంకయ్యా నాయుడు ప్రసంగించారు. తెలుగు భాష, మన స్థానిక సంప్రదాయాల పునరుజ్జీవనం కోసం తెలుగు ప్రజలు ఒకటిగా రావాలని సూచించారు.

ఒక భాషను నిర్లక్ష్యం చేయడం దాని క్షీణతకు దారితీస్తుందని పేర్కొన్న ఉపరాష్ట్రపతి, ఇతర భాషలను, సంస్కృతులను తక్కువ చేయకుండా, ఒకరి మాతృభాషను కాపాడుకోవడం, ప్రోత్సహించడం ప్రతి వ్యక్తి విధి అని అన్నారు.

జాతీయ విద్యా విధానం, 2020 సూచించినట్లు ప్రాథమిక విద్య ఆయా మాతృభాషలో ఉండవలసిన అవసరాన్ని కూడా శ్రీ వెంకయ్య నాయుడు నొక్కిచెప్పారు. ప్రస్తుతం దేశంలోని అత్యున్నత రాజ్యాంగ కార్యాలయాలలో ఉన్న వ్యక్తులు, రాష్ట్రపతి, ఉపాధ్యక్షుడు, ప్రధానమంత్రి, భారత ప్రధాన న్యాయమూర్తి అందరూ తమ మాతృభాషలో ప్రాథమిక విద్యను కలిగి ఉన్నారు. "ప్రజలు తమ మాతృభాషలో నేర్చుకుంటే జీవితంలో విజయం సాధించలేరని, జీవితంలో ఎదగలేరనే తప్పుడు అభిప్రాయాన్ని ప్రజలు కలిగి ఉండకూడదు. దానిని నిరూపించడానికి మనకు చాలా ఉదాహరణలు ఉన్నాయి "అని ఆయన అన్నారు.

తెలుగు సాహిత్యాన్ని ఇతర భారతీయ భాషలలోకి అనువదించడంలో మరింత చొరవ తీసుకోవాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు, తద్వారా ఒకరి భాషా సంప్రదాయం గొప్పతనాన్ని వ్యాప్తి చేస్తుందన్నారు. మహమ్మారి నేపథ్యంలో ఇలాంటి అనేక సాంస్కృతిక సంస్థలు ఆన్‌లైన్‌లో మంచి కార్యక్రమాలు కొనసాగించడాన్ని శ్రీ వెంకయ్య నాయుడు ప్రశంసించారు. భాష, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒకే స్ఫూర్తితో అనుసంధానించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేయాలని సూచించారు.

తెలుగు భాష పరిరక్షణ, ప్రచారం కోసం తెలుగు రాష్ట్రాల వెలుపల వెయ్యికి పైగా సంస్థలు ఉన్నాయని, 'రాష్ట్రేతరా తెలుగు సమాఖ్య' అనే ఉమ్మడి వేదికపైకి రావడానికి నిర్వాహకులు చేపట్టిన చర్యను ప్రశంసించారు. వారి భవిష్యత్ ప్రయత్నాలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

హిమాచల్ ప్రదేశ్ గౌరవ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ, పశ్చిమ బెంగాల్ మహిళా, శిశు అభివృద్ధి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ శశి పంజా, ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్ శ్రీ మండలి బుద్ధ ప్రసాద్, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సి.ఎం.కె.రెడ్డి, రాష్ట్రేతర తెలుగు సమాఖ్య అధ్యక్షుడు శ్రీ సుందర రావు, తదితరులు వర్చ్యువల్ గా సమావేశంలో పాల్గొన్నారు.

# ఇక డ్రైవింగ్ టెస్ట్ లేకుండానే లైసెన్స్!

హైదరాబాద్ , జూన్ 28:డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని భావించే వారికి తీపికబురు. వాహనదారులకు తీపికబురు టెస్ట్ లేకుండా డ్రైవింగ్ లైసెన్స్ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త రూల్స్ తీసుకువచ్చింది. ఇవి వచ్చే నెల నుంచి అమలులోకి రానున్నాయి. దీంతో మీరు ఆర్‌టీవో ఆఫీస్‌కు వెళ్లకుండానే లైసెన్స్ పొందొచ్చు.కరోనా వైరస్ దెబ్బకి కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని భావించే వారిపై ప్రతికూల ప్రభావం పడింది. దీంతో ఇప్పుడు డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని భావించే వారికి కేంద్రం తీపికబురు అందింది. డ్రైవింగ్ లైసెన్స్ పొందటానికి ఆర్‌టీవో ఆఫీస్‌ల ముందు లైన్‌లో గంటల కొద్ది నిలుచో వాల్సిన పని లేదు. కొత్త డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీకి సంబంధించి కేంద్ర రోడ్డు రవాణ రహదారుల మంత్రిత్వ శాఖ డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లకు సంబంధించి కొన్ని రూల్స్‌ను సవరించింది. గుర్తింపు పొందిన డ్రైవింగ్ సెంటర్ల నుంచి డ్రైవింగ్ కోర్సు ద్వారా డ్రైవింగ్ నేర్చుకున్న వారు మీరు డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరు కావాల్సిన పని లేదు.

కేంద్ర ప్రభుత్వ తీసుకొచ్చిన ఈ కొత్త రూల్స్ జూలై 1 నుంచి అమలులోకి వస్తాయి. ఇకపోతే గుర్తింపు పొందిన డ్రైవింగ్ సెంటర్లలోనే ట్రాక్స్ ఉంటాయి. డ్రైవింగ్ నేర్చుకున్న తర్వాత వీటిల్లో వెహికల్ నడిపితే సరిపోతుంది. మళ్లీ ఆర్‌టీవో ఆఫీస్‌కు డ్రైవింగ్ టెస్ట్ కోసం వెళ్లాల్సిన పని లేదు. ఇకపోతే డ్రైవింగ్ స్కూళ్లకు 5 వరకు కేంద్రం గుర్తింపు ఉంటుంది. తర్వాత మళ్లీ రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా గుర్తింపు పొందిన డ్రైవింగ్ స్కూళ్లలోనే ఈ ఫెసిలిటీ ఉంటుందని గమనించాలి. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ కోర్సు 4 వారాల్లో 29 గంటలు ఉంటుంది. మీడియం అండ్ హెవీ వెహికల్ డ్రైవింగ్ కోర్సు 6 వారాల్లో 38 గంటలు ఉండాలి.

# వీహెచ్‌కు రేవంత్ పరామర్శ.. కొత్త అధ్యక్షుడికి కీలక సూచన!

హైదరాబాద్ , జూన్ 28:అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావును పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పరామర్శించారు. పీసీసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ అధిష్టానం రేవంత్‌ను ప్రకటించిన అనంతరం అసంతృప్తి నేతలతో ఆయన వరుసగా భేటీ అవుతున్నారు.

ఈ క్రమంలోనే వీహెచ్‌ను కలిసినట్లు తెలుస్తోంది. తొలుత మాజీ మంత్రి, మాజీ పిసిసి అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యని ఆయన నివాసంలో మార్యద పూర్వకంగా కలిశారు. అనంతరం వీహెచ్ చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లారు.

వీహెచ్ ఆరోగ్యం బాగోలేదని తెలిసి పరామర్శించడానికి వచ్చానని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కుదుటపడిందన్నారు. వీహెచ్ త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. హాస్పిటల్ లో ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై ఆయన చర్చించారని తెలిపారు. దళితులకు ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న ద్రోహంపై పోరాడాలని తనకు సూచించారని తెలిపారు. పార్టీ అభివృద్ధి విషయానికి సంబంధించి కొన్ని సలహాలను ఇచ్చారని, సోనియాగాంధీ వద్దకు కలిసి వెళదామని చెప్పారని వివరించారు.

కాగా, పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ పేరును మొదట్లో వీహెచ్ వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. గతంలో బహిరంగంగా రేవంత్ ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు కూడా చేశారు. వేరే పార్టీ నుంచి వచ్చిన రేవంత్ కు పీసీసీ ఇవ్వొద్దని, పార్టీకి విధేయులుగా ఉన్నవారినే కొత్త అధ్యక్షుడిగా ఎంపిక చేయాలని కాంగ్రెస్ హైకమాండ్‌ను కోరారు.

# హరితహారాన్ని విజయవంతం చేద్దాం

మహబూబ్‌నగర్ : తెలంగాణ భూభాగంలో 33శాతం అడవులు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటడానికి హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో సమృద్ధిగా వానలు కురిసేందుకు హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేవరకద్ర పట్టణంలో ఆయన హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. విద్యార్థుల్లో మొక్కలు నాటే విషయంపై మరింత అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు.




# వస్తూనే ఉత్తమ్‌కు రేవంత్ షాక్! హుజురాబాద్ లో కొత్త అభ్యర్థి?

హైదరాబాద్ , జూన్ 28:తెలంగాణ పీసీసీ అధ్యక్షుడి పేరు ప్రకటన అనంతరం ఎంపీ రేవంత్ రెడ్డి తన మార్క్ చూపించేందుకు సిద్ధమవుతున్నారు. ఓవైపు అసంతృప్తి నేతలను బుజ్జగిస్తునే.. మరోవైపు త్వరలో జరిగే హుజురాబాద్ ఉప ఎన్నికపై ఫోకస్ పెట్టారు. హుజురాబాద్ ఉప ఎన్నిక ముంగిట రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపిక కావడంతో.. ఇప్పుడు ఆయన స్ట్రాటజీ ఎలా ఉండబోతోందన్నది రాజకీయవర్గాల్లో ఆసక్తికకరంగా మారింది. తమ బాహుబలి వచ్చాడంటూ కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటుంటే? అధిష్టానం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని రేవంత్ ఎలా నిలబెట్టుకుంటారన్నది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది. హుజురాబాద్ బైపోల్ కోసం రేవంత్ రెడ్డి ఎలాంటి వ్యూహాన్ని సిద్ధం చేసుకుంటున్నారు ? ఏం చేయబోతున్నారు? అన్న చర్చ సాగుతున్న వేళ.. ఊహించని ప్రచారం ఒకటి తెరపైకి వచ్చింది. హుజురాబాద్‌లో ప్రస్తుతం బీజేపీ నుంచి పోటీ చేస్తున్న ఈటల బలమైన నేత కావడంతో ఆయన్ను ఎదుర్కోబోయే టీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరు అన్నది దానిపై ఎడతెగని ఉత్కంఠ నెలకొంది. హుజురాబాద్ టీఆర్ఎస్ అభ్యర్థి రేసులో ఇప్పటికే అరడజనుకు పైగా నేతల పేర్లు ప్రచారంలో ఉన్నాయి . కానీ ఎవరికి ఆ చాన్స్ దక్కుతుందన్నది సస్పెన్స్‌గా మారింది. అయితే కాంగ్రెస్ తరపున పోటీ చేసే అభ్యర్థి మాత్రం మాజీ పీసీసీ చీఫ్ ఉత్తమ్ బంధువైన కౌశిక్‌రెడ్డినే అంటూ ఇప్పటిదాకా ప్రచారం జరుగుతూ వచ్చింది. కానీ అనూహ్యంగా రేవంత్ రెడ్డి కొత్త పీసీసీ చీఫ్‌గా రావడంతో ఇప్పుడు ఆయన టికెట్ ఇవ్వడం అనుమానమేనన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.హుజురాబాద్ నుంచి కాంగ్రెస్ తరపున మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పోటీ చేస్తారన్న ప్రచారం అనూహ్యంగా తెరపైకి వచ్చింది. కరీంనగర్ జిల్లా నుంచి మొదటి నుంచి రేవంత్ రెడ్డికి మద్దతుగా నిలుస్తున్నారు పొన్నం ప్రభాకర్. ఆ మధ్య రేవంత్ నిర్వహించిన రాజీవ్? రైతు భరోసా యాత్రకు సీనియర్లు ఎవరూ వెళ్లకపోయినా.. పొన్నం ప్రభాకర్ అందులో పాల్గొన్నారు. దీంతో హుజురాబాద్ టికెట్ పొన్నం ప్రభాకర్‌కే ఇచ్చే ఉద్దేశ్యంలో రేవంత్ రెడ్డి ఉన్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు కౌశిక్ రెడ్డి విషయంలో పార్టీలో భిన్నాభిప్రాయలు ఉన్నాయి. ఈటల బర్తరఫ్ సమయంలో దేవరయాంజల్ భూములపై కాంగ్రెస్ వద్దన్నా.. కౌశిక్ రెడ్డి మాట్లాడటం, అలాగే ఇటీవల మంత్రి కేటీఆర్‌తో సన్నిహితంగా మెలగడంతో.. ఆయనకు చాన్స్ దక్కడం కష్టమేన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత తన హయంలో హుజురబాద్ ఉప ఎన్నిక జరగనుండడంతో రేవంత్ దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మరి రేవంత్ ఫార్ములా పని చేస్తుందా? హుజురాబాద్‌లో కాంగ్రెస్ గెలుస్తుందా? అన్నది చూడాలి.

# డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి

వరంగల్ రూరల్, జూన్ 28:: జిల్లా పర్యటనలో భాగంగా పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సంగెం మండలం కాపులకనపర్తి గ్రామం నుంచి సంగెం మండల కేంద్రం వరకు రూ. 5 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..టీఆర్ఎస్ పాలనలోనే రోడ్లకు మహర్థశ పట్టిందన్నారు. కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# మోర్తాడ్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి వేముల



నిజామాబాద్, జూన్ 28:మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్‌ను రోడ్లు-భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్ ఓపీ సేవలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న చికిత్సపై డాక్టర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఐసీయూ, ఆక్సిజన్ బెడ్ల ఏర్పాటు పనులు, కొవిడ్ వ్యాక్సినేషన్ ప్రక్రియను ఈ సందర్భంగా పరిశీలించారు.

వ్యాక్సినేషన్ క్యూలైన్లో ఎక్కువ మంది నిల్చొని ఉండడాన్ని గమనించిన మంత్రి వారితో మాట్లాడారు. హాస్పిటల్‌కు వచ్చే వారికి తాగడానికి వాటర్, కూర్చోవడానికి కుర్చీల సమస్య లేకుండా చూడాలని హాస్పిటల్ సిబ్బందిని ఆదేశించారు.

మంత్రి స్నేహితుల సహకారంతో బాల్కొండ నియోజకవర్గం లోని అన్ని సర్కిల్ హాస్పిటల్స్, పీహెచ్‌సీలలో వసతులు కల్పించడానికి కోటికి పైగా నిధులు సమకూర్చిన విషయం తెలిసిందే. ఆ నిధులతో ఏర్పాటు చేస్తున్న ఐసీయూ, ఆక్సిజన్ బెడ్స్ పనులను ఈ రోజు మంత్రి పరిశీలించారు. మంత్రి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# ఏపీలో భారీగా పెన్షన్ల కోత.. కారణాలు ఇవేనా?

అమరావతి, జూన్ 28:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అర్హులైన వారికి సామాజిక పెన్షన్లు అందిస్తుంది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కళాకారులు, గీతకార్మికులకు నెలనెల పెన్షన్లు అందిస్తోంది. అర్హులైన వారికి ప్రతి నెల 1వ తేదీన గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ద్వారా ఇంటింటికి పెన్షన్లను పంపిణీ చేస్తోంది. అయితే పెన్షన్ల లబ్ధిదారుల్లో కొందరు అనర్హులున్నారన్న విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం తనిఖీలు చేపట్టింది. ముఖ్యంగా వితంతు, ఒంటరి మహిళల పింఛన్లపై తనిఖీ చేపట్టింది. ఈ రెండు కేటగిరీల్లో పెన్షన్ అందుకుంటున్న లబ్ధిదారుల రైస్ కార్డులు, ఆధార్ కార్డులను ప్రభుత్వం పరిశీలించింది. ఇందులో దాదాపు లక్షమందికి పైగా లబ్ధిదారుల వివరాల్లో మార్పులున్నట్లు గుర్తించారు.

ఆధారాల్లో తేడాలున్నవారికి ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం ఇప్పటికే 6వేల మందిని అనర్హులుగా తేల్చినట్లు సమాచారం. అనర్హులుగా తేలిన వారికి జూలై 1న పింఛన్ల పంపిణీని నిలిపేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే నోటీసులు అందుకున్నవారిలో సరైన ధృవపత్రాలు సమర్పిస్తేనే జూలై నెలకు సంబంధించిన పెన్షన్ ఇస్తారు. అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఒంటరి మహిళలు కాకున్నా పెన్షన్ పొందుతున్నట్లు తేలింది. ఈనెల 30 వరకు తనిఖీ ప్రక్రియ కొనసాగనుంది. నోటీసులు అందుకున్న వారు జూలై 15లోగా సంబంధిత ధృవపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. అన్నీ సరిపోలితే ఆగస్టు 1న రెండు నెలలకు సంబంధించిన పెన్షన్లు అందిస్తారు. ప్రభుత్వం ఇచ్చిన రైస్ కార్డుల్లో వితంతు, ఒంటరి మహిళలకు సంబంధించి భర్త పేరు ఉండటం, భర్త స్థానంలో కుమారుడి పేరు నమోదై ఉండటం, ఈ-కేవైసీలో జెండర్ తప్పుగా నమోదవడంతో పాటు సంబంధిత సర్టిఫికెట్లు అందజేయకపోవడం జరుగుతుంది.

# పవన్ అభిమానులకు కోపం.. మంత్రి వెల్లంపల్లిని ట్రోల్ చేసిన ఫ్యాన్స్

హైదరాబాద్ , జూన్ 28:మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ట్విటర్‌లో ట్రెండ్ అవుతున్నారు. పవన్ కల్యాణ్ అభిమానులు ఆయన్ను ట్విటర్‌లో విమర్శలతో హోరెత్తిస్తున్నారు. ఇటీవల కాలంలో పవన్ కల్యాణ్‌పై మంత్రి వెల్లంపల్లి విమర్శలు చేశారు. పవన్ కల్యాణ్ పోటీ చేసిన రెండు చోట్ల ఓడిపోయారని ఎద్దేవా చేశారు. దీంతో పవన్ కల్యాణ్ ఫ్యాన్స్‌కి కోపమొచ్చింది. దీంతో మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్‌ను టార్గెట్ చేశారు.

'సిగ్గలేని వెదవ వెల్లంపల్లి'హ్యాష్ ట్యాగ్‌తో ట్విటర్ విమర్శలు కురిపిస్తున్నారు. గతంలో పవన్ టీషర్టును పబ్లిసిటీ కోసం లాంచ్ చేసిన వెల్లంపల్లి ఫొటోలను పెట్టి ఎద్దేవా చేస్తున్నారు. పవన్ చెబితే తనకు ఓట్లు పతాయని వెల్లంపల్లి అన్నట్టుగా ఫొటోలు డిజైన్ చేసి మరీ ట్విటర్‌ను హోరెత్తిస్తున్నారు. 420, 6093,36 అంటూ వెల్లంపల్లిపై మండిపడుతున్నారు. అంతేకాదు వెల్లంపల్లిని విమర్శించేందుకు తమతో జాయిన్ కావాలని పలువురికి రిక్వెస్టులు పెడుతున్నారు. మరి ఈ అంశంపై మంత్రి వెల్లంపల్లి శ్రీనవాస్ స్పందన ఎలా ఉంటుందో చూడాలి.

# తెలంగాణ బీజేపీని నేనే కాపాడా: మోత్కుపల్లి కీలక వ్యాఖ్య

హైదరాబాద్ , జూన్ 28:సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి బీజేపీ మోత్కుపల్లి నరసింహులు హాజరు కావడంపై పార్టీ అధిష్టానం సీరియస్ అయ్యింది. ఈ నేపథ్యంలో మోత్కుపల్లి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ అనుమతితోనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'దళిత్ ఎంపవర్ మెంట్' సమావేశానికి వెళ్లినట్లు స్పష్టం చేశారు. కొందరు నేతలు బండి సంజయ్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

సీఎం ఏర్పాటు చేసిన దళిత సమావేశానికి వెళ్లి తెలంగాణ బీజేపీని కాపాడనని మోత్కుపల్లి వ్యాఖ్యానించారు. సీఎం సమావేశానికి వెళ్లకపోతే బీజేపీకి అపవాదు వచ్చేదని అభిప్రాయపడ్డారు. దళిత వ్యతిరేక పార్టీగా బీజేపీపై ఉన్న ముద్రను పోగొట్టేప్రయత్నం చేశానని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు ఫోన్ చేసి స్వయంగా ఆహ్వానిస్తే వెళ్లకుండా ఎలా ఉంటానని ప్రశ్నించారు. నిరుద్యోగ సమస్య పైన ఎక్కువ సేపు మాట్లాడారన్నారు.

దళితుల అభ్యున్నతి కోసం సుదీర్ఘ సమావేశం జరిగిందన్నారు. వ్యాపారాల కోసం పార్టీ మారే వ్యక్తులతో నీతులు చెప్పించుకునే స్థితిలో లేనని వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్‌కు తాను దగ్గరవ్వలేదని, స్వలాభం కోసం పార్టీలు మారనని స్పష్టం చేశారు. తాను బీజేపీలోనే ఉంటానని మోత్కుపల్లి తేల్చి చెప్పారు. కాగా, మోత్కుపల్లి వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశమైయ్యాయి.

కాగా, నిన్న ప్రగతిభవన్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశానికి దూరంగా ఉండాలని బీజేపీ నిర్ణయించగా, ఆ ఆదేశాలు పట్టించుకోకుండా మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు హాజరవడమే కాకుండా సీఎం కేసీఆర్ పై ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే.

# రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



రాజన్న సిరిసిల్ల, జూన్ 28(నేటినిజం ప్రతినిధి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి సోమవారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. శివునికి అత్యంత ప్రీతికరమైన రోజు కావడంతో వేకువజాము నుండే భక్తులు కోడె మొక్కు చెల్లించడం కోసం క్యూ లైన్‌లలో బారులు తీరారు. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో స్వామివారికి కోడెమొక్కులు, తలనీలాలు, కళ్యాణాల మొక్కులు చెల్లించుకున్నారు. చండీ హోమాలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని తరించారు. రాజన్నను దాదాపు 30 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని, స్వామివారికి సుమారు రూ. 17 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

# ఏపీలోని 8 జిల్లాల్లో కరోనా ఆంక్షల సడలింపు

అమరావతి, జూన్ 28:ఏపీలో కరోనా తగ్గుముఖం పడుతోంది దీంతో ఆంక్షల సడలింపు లకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. కేసులు తక్కువగా నమోదవుతున్న 8 జిల్లాల్లో కర్ఫ్యూ ఆంక్షలు సడలింపులు ఇస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కోవిడ్ పాజిటివిటీ రేటు 5శాతం కన్నా తక్కువ ఉన్న జిల్లాల్లో సడలింపులను అమలు చేయనుంది. 8 జిల్లాల్లో ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటలవరకూ కర్ఫ్యూ సడలింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇక క రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య దుకాణాలు, రెస్టారెంట్లు ఇతరత్రా మూసివేయనున్నారు. ఇక ఉభయదావరి, కృష్ణా, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో పాజిటివిటీ రేటు 5శాతం కన్నా ఎక్కువగా ఉన్నందున ఈ జిల్లాల్లో సాయంత్రం 6 నుంచి ఉదయం 6వరకూ కర్ఫ్యూ విధిస్తున్నట్లు నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. జులై 1 నుంచి జులై 7 వరకూ తాజా నిర్ణయాలు వర్తించనున్నాయి. పాజిటివిటీ రేటు పరిశీలించాక ఈజిల్లాల్లో సడలింపుపై మళ్లీ నిర్ణయం తిసుకోనుంది ప్రభుత్వం.

# కేజ్రీవాల్‌కు లంచ్ ఏర్పాట్లు చేస్తా : ఆప్ ఆరోపణలపై పంజాబ్ సీఎం ఫైర్

న్యూఢిల్లీ, జూన్ 28:చండీఘఢ్‌లోని పంజాబ్ భవన్‌లో మంగళవారం జరగాల్సిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రెస్‌మీట్‌కు తాము అనుమతి నిరాకరించామని ఆప్ చేసిన ఆరోపణలను పంజాబ్ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్ తోసిపుచ్చారు. ఆప్ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కేజ్రీవాల్ కోరుకుంటే తాము ఆయనకు లంచ్ ఏర్పాట్లు కూడా చేస్తామని చెప్పారు. కొద్దిరోజుల కిందట ఇక్కడ కేజ్రీవాల్ ర్యాలీ కూడా నిర్వహించారని, అలాంటిది ఇప్పుడు ఆయన ప్రెస్‌మీట్‌ను తాము ఎందుకు అడ్డుకుంటామని ప్రశ్నించారు.

ప్రెస్‌మీట్‌ను అడ్డుకుంటున్నామని ఆప్ చెబుతున్న మాటలు కట్టుకథలని కెప్టెన్ సింగ్ పేర్కొన్నారు. మరోవైపు పంజాబ్ భవన్‌లో కేజ్రీవాల్ ప్రెస్‌మీట్‌కు పంజాబ్ సీఎంఓ అనుమతి నిరాకరించిందని అంతకుముందు ఆప్ ఆరోపించింది. అనుమతి లేకున్నా మంగళవారం మధ్యాహ్నం షెడ్యూల్ ప్రకారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపింది. ఇక వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఆప్ హామీల వర్షానికి తెరలేపింది. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెడతామని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.

# కేజ్రీవాల్ ప్రెస్‌మీట్‌కు అనుమతి నిరాకరణ : ఆప్

చండీఘఢ్, జూన్ 28: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పంజాబ్ భవన్‌లో మంగళవారం నిర్వహించే విలేకరుల సమావేశానికి పంజాబ్ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్ కార్యాలయం అనుమతి నిరాకరించిందని ఆప్ ఆరోపించింది. సీఎంఓ అనుమతి లేకున్నా ప్రెస్‌మీట్ నిర్వహించి తీరుతామని స్పష్టం చేసింది. కెప్టెన్ సింగ్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా షెడ్యూల్ ప్రకారం విలేకరుల సమావేశం నిర్వహిస్తామని ఆప్ పేర్కొంది.

మరోవైపు పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ విజయం సాధిస్తే ఉచిత విద్యుత్ అందిస్తామని కేజ్రీవాల్ ప్రకటించారు. రాష్ట్రంలో ధరల పెరుగుదలతో మహిళలు అసంతృప్తితో ఉన్నారని అన్నారు. కాగా వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో జరిగే పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా సిక్కు నేతను ముందుకు తెస్తామని ఆప్ ఇప్పటికే ప్రకటించింది.

# పేద ప్రజలకు కోవిడ్ ప్రొఫైల్ పరీక్షలు ఇక ఉచితం

సిద్దిపేట, జూన్ 28: : తెలంగాణలోనే మొట్టమొదటగా సిద్దిపేట జిల్లాలో కోవిడ్ ప్రొఫైల్ పరీక్షలను ఉచితంగా పేద ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. రూ. 5,500 విలువైన కోవిడ్ ప్రొఫైల్ పరీక్షల కోసం ఇప్పటి వరకూ పేద ప్రజలు ప్రైవేటు డయాగ్నోస్టిక్ కేంద్రాలను, ప్రైవేట్ ఆసుపత్రుల ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. టీ ? డయాగ్నస్టిక్ హబ్‌లో ఇక నుంచి కొవిడ్ పరీక్షలు ఉచితంగా చేస్తామని, దీంతో పేద ప్రజలకు ఆర్థిక భారం తగ్గనున్నదని మంత్రి తెలిపారు.

తొలి విడతలో ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో ఇన్ పేషంట్‌లకు ఉచిత పరీక్షలు చేయనున్నారు. విడతల వారీగా దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల ఆసుపత్రులలో రోగుల నుంచి శాంపిల్స్ సేకరించి టీ ? డయాగ్నస్టిక్ హబ్‌లో పరీక్షలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

కోవిడ్ ప్రొఫైల్ పరీక్షలలో భాగంగా డి- డైమర్, పెరిటిన్, అఖీఖ, ఒఆఊ, అఃఖ వంటి పరీక్షలు చేయనున్నారు. డి- డైమర్ పరీక్షలు చేసేందుకు ఉద్దేశించిన ప్రత్యేక మిషన్‌ను ఇప్పటికే టి ? డయాగ్నస్టిక్ హబ్ లో ఇన్‌స్టాల్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి ఆవరణలో టీ ? డయాగ్నస్టిక్ హబ్ లో ఉచిత కోవిడ్ ప్రొఫైల్ పరీక్షలు ప్రారంభం అయిన తర్వాత దశల వారీగా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లలో ప్రభుత్వం అందుబాటులోకి తేనున్నట్లు మంత్రి హరీశ్ రావు చెప్పారు.



# సకాలంలో పంట రుణాలు అందించాలి : మంత్రి హరీశ్ రావు




హైదరాబాద్ , జూన్ 28:తెలంగాణ రాష్ట్రంలో రైతులకు సకాలంలో పంటరుణాలు అందేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ హరీశ్ రావు బ్యాంకర్లను కోరారు. సోమవారం బీఆర్కే భవన్‌లో ఎస్ఎల్‌బీసీ (రాఃఅ) 29 వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2021-22 సంవత్సరానికి సంబంధించి 1,86,035.60 కోట్లతో యానివల్ క్రెడిట్ ప్లాన్‌ను ఆమోదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

ఒక వారంలో దాదాపు 61 లక్షల మంది పైగా రైతుల ఖాతాలలో 7,360 కోట్లు పైగా జమ చేశామని తెలిపారు. రైతు బంధు ద్వారా ప్రభుత్వం అందించిన సహాయంతో ఇతర రుణాలకు మళ్లించకుండా వారి సేవింగ్ అకౌంట్లలో జమ చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీచేశారని, బ్యాంకులుఈ ఆదేశాల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా రైతులు ఎరువులు, విత్తనాలు, ఇతర అవసరాలకు వినియోగిస్తారన్నారు. కొవిడ్ సమయంలో బ్యాంకర్లు తమ సేవలు అందించాయని, బ్యాంకింగ్ సిబ్బందికందరికి వ్యాక్సినేషన్ కు చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. చిన్న చిన్న వ్యాపారస్తులకు మరిన్ని ముద్రా రుణాలను అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్, తృణధాన్యాలు తదితర పంటల సాగును ప్రోత్సహిస్తుందన్నారు. స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల నిర్మాణాన్ని వేగవంతం చేసిందని బ్యాంకర్లకు తెలిపారు.

# ఊపిరితిత్తులపై ఎఫెక్ట్ చూపుతున్న 'డెల్టా ప్లస్'

హైదరాబాద్ , జూన్ 28:కరోనా వైరస్‌లోని మిగతా రకాలతో పోలిస్తే డెల్టా ప్లస్ వేరియంట్ ఊపిరితిత్తుల కణజాలంతో ఎక్కువగా పెనవేసుకుపోతోందని కొవిడ్-19 కార్యాచరణ బృందం (ఎన్‌టాగీ) అధిపతి ఎన్.కె.అరోడా తెలిపారు. అయితే దీన్నిబట్టి బాధితుల్లో ఇది తీవ్ర వ్యాధిని కలిగిస్తుందని గానీ, ఎక్కువ సంక్రమణ శక్తి కలిగి ఉంటుందని గానీ భావించలేమన్నారు.

దీనిపై ఇంకా స్పష్టత రాలేదని చెప్పారు. మరింత విస్తృతంగా కేసులు వెలుగు చూశాకే ఈ వేరియంట్ ప్రభావంపై ఒక అంచనాకు రావడానికి వీలవుతుందన్నారు. ఒకటి లేదా రెండు డోసుల మేర కొవిడ్ టీకా పొందినవారిలో ఈ రకం వైరస్ వల్ల స్వల్పస్థాయి వ్యాధి లక్షణాలే ఉంటున్నాయని చెప్పారు.

డెల్టా ప్లస్ వల్ల మూడో ఉద్ధృతి వస్తుందా అన్నది ఇప్పుడే చెప్పలేమని అరోడా పేర్కొన్నారు. 'కొత్త వేరియంట్లు లేదా ఉత్పరివర్తనలకు కరోనా ఉద్ధృతులతో సంబంధం ఉంటోంది. డెల్టా ప్లస్ కూడా కొత్త రకమే కావడం వల్ల అందుకు అవకాశముంది. దీనివల్ల మూడో ఉద్ధృతి వస్తుందా అన్నది ఇప్పుడే చెప్పడం కష్టం. మూడు అంశాలపై ఇది ఆధారపడి ఉంటుంది. మొదట.. గత మూడు నెలల్లో భీకరస్థాయిలో రెండో ఉద్ధృతిని ఎదుర్కొన్నాం. అది ఇంకా కొనసాగుతోంది. ఈ పరిస్థితి కొత్త రకంపై ప్రజల స్పందనను ప్రభావితం చేస్తుంది. జనాభాలో ఎంతమంది.. రెండో ఉద్ధృతిలో కరోనా బారిన పడ్డారన్న దానిపై మూడో విజృంభణ ఆధారపడి ఉంటుంది. పెద్ద సంఖ్యలో ప్రజలు ఇప్పటికే ఇన్‌ఫెక్షన్ బారినపడి ఉంటే తదుపరి ఉద్ధృతిలో ప్రజలకు సాధారణ జలుబు లాంటి రుగ్మతలే కలగొచ్చు. ఇక రెండోది వ్యాక్సినేషన్. టీకాల కార్యక్రమంలో వేగం చాలా ముఖ్యం. కనీసం ఒక్క డోసు వేసినా ప్రయోజనం ఉంటుంది. అందువల్ల వ్యాక్సినేషన్ వేగంగా సాగితే మూడో ఉద్ధృతి ముప్పు తగ్గిపోతుంది. ఇక మూడోది.. ఇప్పటికే ఇన్‌ఫెక్షన్ బారినపడటం, టీకా పొంది ఉండటానికి తోడు కొవిడ్ నిబంధనలను కచ్చితంగా పాటించడం వల్ల మనకు తదుపరి కరోనా విజృంభణ నుంచి రక్షణ లభిస్తుంది' అని పేర్కొన్నారు.

# ప్రజల ఆత్మ గౌరవానికి భంగం కలిగించొద్దు

## జిల్లా పోలీసులకు డీజీపీ మహేందర్‌రెడ్డి సూచన

ఖమ్మం, జూన్ 28 :ప్రజలందరికీ పోలీసులు ఏకీకృత సేవలందించాలని, వారి ఆత్మ గౌరవానికి భంగం కలిగించొద్దని డీజీపీ మహేందర్‌రెడ్డి సూచించారు. యాదాద్రి జిల్లా అడ్డగూడూరు పోలీసుల అదుపులో మరణించిన చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన అంబటి మరియమ్మ కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆదివారం ఉదయం ఆయన ఖమ్మం వచ్చారు. తొలుత చికిత్స పొందుతున్న బాధితురాలి కుమారుణ్ని పరామర్శించారు. ఘటన గురించి తీశారు. డీజీపీ స్పందిస్తూ.. మరియమ్మ మృతిపై ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణకు ఆదేశించిందని, కుటుంబ సభ్యులు ఆందోళన చెందొద్దని, విచారణ అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఖమ్మం త్రీటౌన్, కొణిజర్ల, ఖమ్మం రూరల్ పీఎస్‌లను సందర్శించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై ఇన్‌స్పెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. కేసుల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.

పోలీసులు ఏకీకృత సేవలందించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి సూచించారు. ప్రజల ఆత్మ గౌరవానికి భంగం కలిగించవద్దని నిర్దేశించారు. డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదివారం ఖమ్మం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు పోలీసుల అదుపులో మరణించిన చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన అంబటి మరియమ్మ కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆదివారం ఉదయం 10 గంటలకు హెలికాప్టర్ ద్వారా ఖమ్మానికి చేరుకున్నారు. పలు పోలీసు స్టేషన్లను తనిఖీ చేసి జిల్లాలో శాంతి భద్రతల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులు నిర్వహించాల్సిన విధులపై ఆయన దిశానిర్దేశం చేశారు. పటేల్ స్టేడియం నుంచి నేరుగా మరియమ్మ కుమారుడు ఉదయ్‌కిరణ్ చికిత్స పొందుతున్న ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి అతణ్ని పరామర్శించారు. జరిగిన సంఘటన గురించి ఉదయ్‌కిరణ్‌తో మాట్లాడి ఆరా తీశారు. పోలీసులు తన పట్ల వ్యవహరించిన తీరు, కొట్టిన దెబ్బలను ఉదయ్‌కిరణ్ వివరించాడు. తల్లి మరియమ్మ తన చేతిలోనే ప్రాణాలు వదిలిందని, ఇంకా ఆ షాక్ నుంచి కోలుకోలేకపోతున్నానని కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ సందర్భంగా డీజీపీ స్పందిస్తూ.. మరియమ్మ మృతిపై ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణకు ఆదేశించిందని, కుటుంబ సభ్యులు ఆందోళన చెందొద్దని, విచారణ అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

మరియమ్మ కుమార్తెలు, అల్లుళ్లను డీజీపీ పరామర్శించారు. మరియమ్మ మృతి దురదృష్టకర సంఘటన అని అన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. కలెక్టర్ కర్ణన్ కూడా ఉదయ్‌కిరణ్‌ను పరామర్శించారు. ప్రభుత్వం మరియమ్మ కుటుంబానికి రూ.35 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని, ప్రభుత్వ ఉద్యోగం సైతం ఇవ్వాలని నిర్ణయించిందని, త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని వివరించారు. ఉదయ్‌కిరణ్ ఆరోగ్య పరిస్థితి గురించి డీజీపీ మహేందర్‌రెడ్డి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆందోళన చెందవద్దంటూ ఉదయ్‌కిరణ్‌ను ఓదార్చారు. అనంతరం డీజీపీ ఖమ్మం కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమావేశమయ్యారు. అక్కడి నుంచి ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌కు చేరుకొని విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గల ఎంటీ సెక్షన్‌ను తనిఖీ చేశారు. ఖమ్మం త్రీటౌన్, ఖమ్మం రూరల్, కొణిజర్ల పోలీస్ స్టేషన్లనూ సందర్శించారు. ప్రజల ఆత్మ గౌరవానికి భంగం కలుగకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజామోదం లభించడం ద్వారానే విధి నిర్వహణ సామర్థ్యం ఆధార పడి ఉంటుందని అన్నారు. వివిధ కారణాల వల్ల పోలీసులు అదుపులోకి తీసుకున్న వాహనాలను సత్వరం వాహన దారులకు అందేలా చట్ట ప్రకారం వ్యవహరించాలని, ఒకవేళ ఆ వెహికిల్స్ వాహనదారులకు చేరే పరిస్థితి లేకపోతే మూడు నెలలకు ఒకసారి ఉన్నతాధికారుల అనుమతితో వేలం వేయాలని సీపీ విష్ణుకు సూచించారు. అనంతరం ఖమ్మంలోని పటేల్ స్టేడియానికి చేరుకుని హెలికాప్టర్ ద్వారా నార్త్ జోన్ ఐజీ నాగిరెడ్డితో కలిసి హెదరాబాద్ తిరిగి వెళ్లిపోయారు. డీజీపీకి సీపీ విష్ణు ఎస్ వారియర్, ట్రైనీ ఎస్పీ స్నేహమెహ్రా, డీసీపీ ఇంజారపు పూజ, అడిషనల్ డీసీపీ సుభాశ్ చంద్రబోస్ తదితరులు వీడ్కోలు పలికారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరం

## -విలేకరుల సమావేశంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్, జూన్ 28: సదర్మాట్ ప్రాజెక్టు నిర్మాణం కోసం రైతుల నుంచి సేకరించిన భూములకు మూడు నెలల్లోనే పరిహారం అందిస్తామని రైతులకు మాట ఇచ్చామని, ఈ ప్రకారం రెండుమూడు రోజుల్లో పరిహారం అందిస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ,న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణంలోని శాస్త్రినగర్ కాలనీలోని తన నివాసంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదర్శనగర్, కొత్తూరు, టెంబుర్ని, పొన్కల్, కమల్‌కోట్ గ్రామాల రైతులకు రెండు మూడు రోజుల్లోనే పరిహారం అందిస్తామని చెప్పారు. మొత్తం రూ.46 కోట్ల వరకు పెండింగ్ ఉండేవని, ఇదివరకే రూ.8.50 కోట్లు పీడీ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. ఇటీవల మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక శాఖ కార్యదర్శిని కలువడంతో ఈ నెల 26న రూ.30 కోట్లను రిలీజ్ చేశారని చెప్పారు. మొత్తం రూ.38.50 కోట్లను ఐదు గ్రామాల రైతులకు త్వరలోనే అందిస్తామన్నారు. కొవిడ్ కారణంగా ప్రభుత్వానికి లక్షకోట్ల ఆదాయం తగ్గిందని, అందువల్ల పరిహారం అందించడంలో జాప్యం తలెత్తిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నదని, సంక్షేమ పథకాలతో రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. నిర్మల్ జిల్లాలో 1.80 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండిందని, జిల్లా రైతుల ఖాతాల్లో రూ.350 కోట్లు జమయ్యాయని పేర్కొన్నారు. 27 ప్యాకేజీతో రూ.300 కోట్లతో నూతనంగా పనులను ప్రారంభించుకున్నామని, వచ్చే రెండేళ్లలో 50 వేల ఎకరాలకు సాగు నీరు అందనుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. రైతులు నూతన సాగు విధానాలను అవలంబించి పంటలను సాగు చేయాలని, దీంతో దిగుబడి పెరుగుతుందని తెలిపారు. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదని, పీడీ యాక్టు నమోదు చేస్తున్నదన్నారు. రూ.3.5 కోట్లతో చించోలి వద్ద ఐదు ఎకరాల స్థలంలో ఆర్టీవో కార్యాలయం నిర్మిస్తున్నామని, అన్ని సౌకర్యాలతో వాహనదారులకు ట్రాక్ నిర్మాణం చేస్తున్నామన్నారు. దేవాదాయ శాఖ ద్వారా జిల్లాలో దాదాపు రూ.60 కోట్లతో 600 ఆలయాలను నిర్మించుకున్నామని తెలిపారు. హరితహారం, పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. హరితహారం కార్యక్రమం ద్వారా విరివిగా మొక్కలు నాటి 33 శాతం అడవులను పెంచాలన్నారు. జిల్లాలో నూతన కలెక్టరేట్ భవనాల నిర్మాణం 60 శాతం పూర్తయిందని తెలిపారు.



# వైఎస్ఆర్ బీమా పథకంలో మార్పులు.. తక్షణమే రూ.లక్ష సాయం



అమరావతి, జూన్ 28:ఏపీ ప్రభుత్వం వైఎస్ఆర్ బీమా పథకంలో కీలక మార్పులు చేసింది. దీనికి సంబంధించిన నూతన మార్గదర్శకాలు విడుదల చేసింది. జూలై 1 నుంచి కొత్త మార్పులతో వైఎస్ఆర్ బీమా అమలు చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. పేద కుటుంబంలో అర్జించే వ్యక్తి మరణించినప్పుడు ఆ కుటుంబానకి వెంటనే సాయమందేలా వైఎస్ఆర్ బీమా పథకంలో మార్పులు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. సంపాదించే వ్యక్తి 18-50 ఏళ్ల మధ్య వయస్సు ఉండి? సహజంగా మరణిస్తే రూ. లక్ష ఆర్థిక సాయం అందించున్నట్లు తెలిపింది. అలాగే సంపాదించే వ్యక్తి 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయస్సు కలవారై? ప్రమాదవశాత్తూ మరణించినా, శాశ్వత వైకల్యానికి గురైనా రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించనుంది.

ప్రభుత్వం అందించే మొత్తాన్ని 15 రోజుల్లోగా మృతుల నామినికీ చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎంపిక చేసిన బీమా సంస్థకు ప్రభుత్వమే ప్రీమియం మొత్తాన్ని చెల్లిస్తుంది. దీనికి కార్మిక శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. ఇక నుంచి ఈ పథకాన్ని గ్రామ, వార్డు సచివాలయాల విభాగం పథకాన్ని అమలు చేస్తుంది. బీపీఎల్ కుటుంబాలను ఈ నెలాఖరులోగా నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# పీసీసీ చీఫ్ గా రేవంత్.. మొక్కులు చెల్లించిన సీతక్క



హైదరాబాద్ , జూన్ 28:తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఎంపీ రేవంత్ రెడ్డి ఎన్నిక కావడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క మొక్కులు చెల్లించుకున్నారు. పీసీసీ రేసులో ఉన్న రేవంత్ రెడ్డికి రావాలని మేడారం అమ్మవారిలకు మొక్కుకున్నారు. తాజాగా రేవంత్ రెడ్డికి పీసీసీ పదవి దక్కటంతో ఎమ్మెల్యే సీతక్క మొక్కులు చెల్లించారు. ఊరేగింపుగా వెళ్లిన సీతక్క అమ్మవారిలకు ప్రదక్షిణలు చేసి? మొక్కు చెల్లించారు. తన సోదరుడు రేవంత్ కు పదవి దక్కటం పట్ల సీతక్క సంతోషం వ్యక్తం చేశారు. రేవంత్ పీసీసీ పదవి ఇచ్చినందుకు సోనియా గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

కాగా, అన్న-చెల్లెలుగా ఒక్కటిగా ఉండే రేవంత్ రెడ్డి, సీతక్క టీడీపీకి రాజీనామా చేసి ఒకేసారి కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే.

# సీఎం జగన్‌ను కలిసిన సీఎస్



అమరావతి, జూన్ 28:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ సీఎం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిత్యనాథ్ దాస్ పదవీ కాలాన్ని మూడు నెలల పాటు పొడిగించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఆయన పదవీ కాలాన్ని జులై 1 నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకూ పొడిగిస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సీఎస్ ఆదిత్యానాథ్ సీఎం జగన్ ను కలిశారు.

# తెలంగాణలో బాగా తగ్గిన కరోనా కేసులు

హైదరాబాద్ , జూన్ 28:తెలంగాణలో కరోనా కేసులు బాగా తగ్గాయి. నిన్నటి వరకు 1000కి పైగా నమోదైన పాజిటివ్ కేసులు.. ఇవాళ వెయ్యి లోపే నమోదు అయ్యాయి. రాష్ట్రంలో కొత్తగా 993 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా, 9 మంది మరణించారు. 1,417 మంది కరోనా నుంచి కోలుకుని డిశ్చార్జి అయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుతం 13,869 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇవాళ 1,12,982 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో కొత్తగా 124 కేసులు నమోదు అయ్యాయి.

# టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే పల్లెలన్ని అభివృద్ధి

## -జడ్పీ చైర్ పర్సన్ శ్రీమతి న్యాలకొండ అరుణరాఘవరెడ్డి



రాజన్న సిరిసిల్ల, జూన్ 28(నేటినిజం ప్రతినిధి): టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే పల్లెల అభివృద్ధి జరుగుతుందని జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి అన్నారు. సోమవారం కొనరావుపేట మండలంలో పల్లిమక్త,కొండాపూర్,మామిడిపల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ తో కలిసి జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి పకృతి వనాన్ని మరియు వైకుంఠదామలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల కంటె టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగాయని అన్నారు.పల్లె ప్రగతి, హరితహారం కార్యక్రమాల్లో భాగంగా నాటిన మొక్కలు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాల నిర్మాణాలతో గ్రామాలు కళకళ లాడుతున్నాయని తెలిపారు. పల్లె పకృతి వనాలతో గ్రామాల్లో నివసించే ప్రజలందరికీ ఆహ్లాదకరమైన వాతావరణం అందిచటానికి ప్రభుత్వం పల్లె పకృతి వనాలను ఏర్పాటు చేయటం జరుగిందని అన్నారు.వీటి ఏర్పాటుతో గ్రామాల్లో కొత్త శోభ సంతరించుకుందని అన్నారు. ఎమ్మెల్యే రమేష్ బాబు సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందని, ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమానికి ప్రత్యేకంగా జిల్లా కు ఒక కోటి రూపాయలను విడుదల చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. పల్లె ప్రగతిలో మన జిల్లాను తెలంగాణ రాష్ట్రం లోనే ముందంజలో ఉంచుకుందామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య గౌడ్, డి పి ఓ రవీందర్, తాసిల్దార్ నరేందర్, ఎంపిడిఓ రామకృష్ణ, సింగిల్విండో చైర్మన్ నర్సయ్య యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హన్మండ్లు, సర్పంచులు అనిల్, భారత,దేవయ్య, టీఆరెస్ మండలఅధ్యక్షుడురాఘవరెడ్డి,ఎంపిటిసిలు,టిఆర్ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# అర్బన్ ఎంపీపీ కార్యాలయంలో ఘనంగా పీవీ నరసింహారావు జయంతి వేడుకలు..



రాజన్న సిరిసిల్ల, జూన్ 28(నేటినిజం ప్రతినిధి): బహుబాషా కోవిదులు, బహుముఖ ప్రజ్ఞాశాలి భారత మాజీ ప్రధాని పాములపర్తి వెకట నర్సింహారావు గారి శత జయంతి వేడుకలను వేములవాడ అర్బన్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు, సందర్బంగా ఎంపీపీ.ఎంపీ బూర వజ్రమ్మ బాబు,జడ్పీటీసీ మ్యాకల రవి తోపాటు సిబ్బంది పి.వి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు, ఈ సందర్బంగా ఎంపీ బూర వజ్రమ్మ బాబు మాట్లాడుతూ భారతదేశ ప్రధానమంత్రి పదవిని అధిష్టించిన మొదటి దాక్షిణాత్యుడు, ఒకేఒక్క తెలుగువాడని గుర్తు చేశారు, పీవీ గా ప్రసిద్ధుడైన అతను బహుభాషావేత్త, రచయిత. భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజంవేసి, కుంటుతున్న వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించిన ఘనత సొంతం చేసుకున్న వ్యక్తి అని కొనియాడారు,1957 లో శాసనసభ్యుడిగా రాజకీయజీవితం ఆరంభించిన పివి రాష్ట్రమంత్రిగా, ముఖ్యమంత్రి గానే కాకుండా కేంద్ర రాజకీయాలలో కూడా ప్రవేశించి ప్రధానమంత్రి పదవిని చేపట్టాడని గుర్తు చేశారు,,ఈ కార్యక్రమం లో మండల పరిషత్ కార్యాలయం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కళాప్రదర్శన




రాజన్న సిరిసిల్ల, జూన్ 28(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో సోమవారం రోజున బోయినపల్లి మండలంలోఏఎస్సైచంద్రమౌళిఆధ్వర్యంలో పోలీసు కళాప్రదర్శ న ఇచ్చారు . ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని పోలీసుకళాబృందం అవగాహన కల్పి స్తూ మాస్కు ధరించడం , భౌతికదూరం పాటించడంతో పాటుగా చేతులు ఎప్పటిక .పుడు శుభ్రం చేసుకోవాలని కళాబృందం సభ్యులు ప్రజలకు తెలియజేశారు . సైబర్ నేరాలపై మూఢ నమ్మకాలపై రోడ్డు ప్రమాదాలపై వివిధ ప్రాంతాలలో ఆట పాటల ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా కళా బృందం ఇన్చార్జ్ సతీష్ చరణ్ , సభ్యులు పాల్గొన్నారు

# పీవీ సంస్కరణలే దేశాన్ని కాపాడాయి

## -మున్సిపల్ కమిషనర్ శ్యాం సుందర్ రావు

రాజన్న సిరిసిల్ల, జూన్ 28(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ పీవీ సంస్కరణలే దేశాన్ని కాపాడాయని వేములవాడ



మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ రావు అన్నారు. సోమవారం నాడు వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో మాజీ ప్రధాని పివి నరసింహారావు శతజయంతి వేడుకలు ఘనంగానిర్వహించారు.

రిసందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఈ సందర్భంగా పివినరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు.

అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పివి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయానికి దేశం అధకారంలో ఉందని, ఉన్నప్పటికి బంగారం నిల్వలను విదేశాల్లో తాకట్టు పెట్టుకునే పరిస్థితి తనకు మాత్రమే సాధ్యమైన దేశాన్ని కాపాడి, ఆర్థిక రంగంలో మరింత ముందుకు నడిపించిన ధీరుడాయన, అంటూ మాజీ ప్రధాని పీవీ నరసింహారావును కీర్తించారు.తెలంగాణకు ముఖ్యమంత్రి కేసీఆర్, దేశాభివృద్ధి కోసం పీ వీ అందించిన సేవలనుతరతరాలుగుర్తుంచుకుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# నేడు అమరావతిలో టీడీపీ అధినేత చంద్రబాబు దీక్ష

అమరావతి, జూన్ 28:ఏపీలో కరోనా బాధితులను ఆదుకోవాలనే డిమాండ్‌తో మంగళవారం నాడు తెలుగుదేశం పార్టీ ఆందోళనకు సిద్ధమవుతోంది. 'సాధన దీక్ష' పేరుతో రేపు ఏపీ వ్యాప్తంగా నిరసన దీక్షలను చేపట్టబోతోంది.

అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు దీక్షను చేపట్టనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చంద్రబాబు దీక్ష కొనసాగనుంది. ఈ దీక్షలో ఆయనతో పాటు మరో 15 మంది టీడీపీ సీనియర్ నేతలు పాల్గొనబోతున్నారు.

కాగా టీడీపీ సీనియర్ నేత, ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం కరోనా బాధితులను ఆదుకోకుంటే భవిష్యత్ కార్యాచరణను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. చంద్రబాబు దీక్షతో అయినా జగన్ ప్రభుత్వంలో చలనం రావాలని ఆయన ఆకాంక్షించారు. ఆక్సిజన్ అందక మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు, కరోనా మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల తక్షణ సాయాన్ని అందించాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు.

# ఏపీ కరోనా అప్డేట్ -కొత్తగా 2224 కేసులు

అమరావతి, జూన్ 28:ఏపీ లో కరోనా తగ్గుముఖం పడుతూ వస్తుంది. తాజాగా గడిచిన 24 గంటల్లో మొత్తం 71,758 మందికి కరోనపరీక్షలు చేయగా?2224 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. అలాగే గడిచిన 24 గంటల్లో మొత్తం 31 మంది కరోనా తో మృతి చెందారు. అలాగే నిన్న ఒక్క రోజే 4714 మంది కరోనా నుంచి కొలుకున్నారు.

ఇక ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 42,252మంది ప్రస్తుతం యాక్టీవ్ కేసులు ఉన్నాయి. అలాగే తాజా గణాంకాల ప్రకారం మొత్తం కేసుల సంఖ్య 18,82,096 కి చేరింది. అలాగే 18,27,214మంది డిశ్చార్జ్ అయ్యారు. మొత్తం కరోనా కారణంగా మరణించిన వారి సంఖ్య 12,630కు చేరింది.

# సీఎం కేసీఆర్‌పై పీవీ తనయుడి ప్రశంసలు

హైదరాబాద్ , జూన్ 28: మాజీ ప్రధాని, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు శత జయంతి ఉత్సవాలను ఏడాది కాలం పాటు ఘనంగా నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురిపిస్తోంది. పీవీ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన సీఎం కేసీఆర్‌ను పీవీ తనయుడు పీవీ ప్రభాకర్ రావు ప్రశంసించారు. పీవీ శతజయంతి ముగింపు ఉత్సవాలు పీవీ జ్ఞానభూమిలో జరిగాయి. ఈ సందర్భంగా నెక్లెస్ రోడ్డులో26 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన పీవీ కాంస్య విగ్రహాన్ని గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్ ఆవిష్కరించారు.

నవభారత నిర్మాత, నిత్య సంస్కరణశీలి, మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ఖ్యాతిని నేటి తరానికి తెలిపిన, భవిష్యత్ తరాలు తెలుసుకునేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని పీవీ ప్రభాకర్ రావు అన్నారు. పీవీ మన ఠీవీ అనే నినాదంతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన శత జయంతి ఉత్సవాలతో.. చరిత్రకు ఆవహించిన మబ్బులు తొలగిపోయినట్టు అయిందని అభివర్ణించారు. శతజయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కె.కేశవరావు పెద్దన్నలా కార్యక్రమాల్ని ముందుండి నడిపించారని అన్నారు. కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించడం వల్ల తన వంతు బాధ్యతను నిర్వహించేందుకు దోహదపడిందని తెలిపారు.

దేశ విదేశాల్లోని పీవీ అభిమానులను, తెలుగు వాళ్లను, భారతీయుల్ని వేడుకల్లో భాగస్వాములు చేయడం అభినందనీయమని చెప్పారు. దేశవ్యాప్తంగానే కాకుండా వివిధ దేశాల నుంచి ఎంతో మంది స్వచ్ఛందంగా శత జయంతి ఉత్సవాలు నిర్వహించడం, పీవీ ఖ్యాతి గురించి మాట్లాడటం గొప్ప విషయమని అన్నారు. విశ్వమానవుడి ఖ్యాతిని ఈ తరం తెలుసుకునేందుకు ఉత్సవాలు వేదికగా మారాయని పీవీ ప్రభాకర్ రావు అన్నారు.

పీవీని 360 డిగ్రీల కోణంలో ఆవిష్కరించడమే లక్ష్యంగా సాగిన ఉత్సవాలు.. సంతృప్తిని మిగిల్చాయని ప్రభాకర్ రావు అన్నారు. పీవీ రచనల్ని, పీవీపై రాసిన రచనల్ని ప్రభుత్వం ముద్రించడం అభినందనీయమన్నారు. పీవీ సమకాలీన నేతలు, రచయితలు, జర్నలిస్ట్ లు ఎందరో పీవీ పాలనాదక్షతను వివరిస్తూ అద్భుత రచనలు చేశారని అన్నారు. తమ అనుభవాల్ని పంచుకున్నందుకు, అభిమానాన్ని చాటుకున్నందుకు సంతోషంగా ఉందని పీవీ ప్రభాకర్ రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీవీపై ప్రేమను చాటిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. హుస్సేన్ సాగర తీరంలో పీవీ నిలువెత్తు విగ్రహం ఏర్పాటు, నెక్లెస్ రోడ్డుకు పీవీ మార్గ్ అని నామకరణం ద్వారా తెలంగాణ ప్రభుత్వం? నిజమైన నివాళి అర్పించిందని అన్నారు. పీవీ ఘనతను ఈ తరానికి, భవిష్యత్ తరాలకు తెలియచేసేందుకు శతజయంతి ఉత్సవాలు ఆరంభం మాత్రమేనని.. ఇంకా ఎంతో చేయాల్సి ఉందని ప్రభాకర్ రావు తెలిపారు.

# వేల ఏండ్ల చరిత్రకు సాక్షం ఒక ఫోటో మాత్రమే

## (29 జూన్ 'ప్రపంచ కెమెరా దినం' సందర్భంగా)

ఫోటీలు తీసే సాధనంగా 'కెమెరా' మనందరికీ విదితమే. తమ తమ డ్రాయింగ్ రూముల్లో గోడలకు వేళాడే ఫోటోలు తమ గత ముఖ్య సన్నివేశాలు వేడుకలను నిత్యం గుర్తు చేస్తుంటాయి. ఫోటోగ్రఫీ అనగా 'వెలుతురుతో వ్రాయడం' మరియు 'కెమెరా అబ్స్కూరా' అనగా 'చీకటి గది' అని అర్థం. కెమెరా మరియు ఫోటోగ్రఫీ చరిత్ర 1825లో హెలియోగ్రాఫ్ రూపంలో 'జోసెఫ్ నైసీ' చొరవతో ప్రారంభమైంది. 1839లో 'లూయిస్ జాఖీస్ డగ్యూరె' కృషితో ప్రథమ వెలసిపోని ఫోటోను తీయడంతో వారిని 'ఫోటోగ్రఫీ పితామహుడు'గా పిలుస్తున్నారు. ఫోటోగ్రఫీ రంగంలో స్థిరమైన ఫోటోఫిలిమ్ రూపకర్తగా 'జార్జ్ ఈస్ట్‌మన్' పరిశోధనలో 1888లో తొలి 'కొడాక్' కెమెరా ఆవిర్భవించింది. 1936లో జపాన్ దేశంలో 'కానన్' కెమెరా తయారుచేయబడి అమ్మకానికి వచ్చింది. 1989లో తొలి 'డిజిటల్ కెమెరా'ను జపాన్‌లోని 'ఫ్యూజీ' కంపెనీ వాణిజ్యపరంగా విడుదల చేసింది. 2010 వరకు మార్కెట్లో 'డిజిటల్ వీడియో కెమెరా' అందుబాటులోకి వచ్చింది. ప్రతి ఒక్కరి జీవితంలో ఫోటోల ప్రాధాన్యతను గుర్తించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏట 29 జూన్ రోజున 'ప్రపంచ కెమెరా దినం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అత్యంత మేలైన డిజిటల్ కెమెరాలను నిర్మించిన కంపెనీగా 'కొడాక్'కు గుర్తింపు ఉన్నది.

వేడుకల్లోని సంతోష క్షణాలను బంధించడం, ప్రకృతి అందాలను బంధించడం, నేర ఘటనలకు సాక్షంగా నిలవడం, ముఖ్య సన్నివేశాలను భావితరాలకు అందించడం, సమాజహిత కార్యాలు, చారిత్రాత్మక ఘటనలు, సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులు లాంటి పలు సందర్భాలలో కెమెరాలు తీసే ఫోటోలు మనందరికీ తెలుసు. 2000 నాటికి స్మార్ట్ ఫోన్‌లో కెమెరా ఇమిడి ఉండడంతో సాంప్రదాయ కెమెరాలకు ప్రాధాన్యత తగ్గిందనే చెప్పాలి. కెమెరా లేకుండా నిన్నటి గుర్తులు సజీవంగా కనిపించవు. 'ఒక ఛాయాచిత్రం వేల మాటలకు సమాన అర్థాన్ని ఇస్తుంది' అనేది అతిశయోక్తి కాదు. గత స్మృతులకు నిలువెత్తు సాక్ష్యాలు ఛాయాచిత్రాలు. నేడు మన చేతిలో ఇమిడి ఉన్న స్మార్ట్ ఫోన్ల మాధ్యమంగా 'సెల్ఫీ ఫోటోలు' తీసుకునే ఆధునిక సాంకేతిక ఉపకరణాలు మనకు చేరువైనాయి. కెమెరాతో ఫోటోలు తీయగలగడం అనేది ఓ అద్భుత కళ. ఒక చక్కటి ఛాయాచిత్రం ఓ అద్భుత మనోఉల్లాసానికి కారణం అవుతుంది.

ఓ ఫోటో వేల ఏండ్లు చరిత్రకు సాక్షిగా నిలుస్తుంది. నేటి స్మార్ట్ ఫోన్‌లో ఇమిడి ఉన్న అత్యాధునిక కెమెరాను ఉపయోగించి నిత్యం ఎన్నో అద్భుత సన్నివేశాలను బంధిస్తున్నాం. నేటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన కెమెరాతో క్షణాల్లో ఫోటో తీయడం, వేల ఫోటోలను సేవ్ చేసుకోగలగడం, ఫోటోలను తిరిగి మెరుగుపరుచు కోగలగడం లాంటి వసతులు అందుబాటులోకి వచ్చాయి.

ప్రపంచ కెమెరా దినం సందర్భంగా మన స్మార్ట్ ఫోన్‌ను ఉపయోగించి పలు సన్నివేశాలను బంధించడం, మన ఫోటోలను సామాజిక మాధ్యమాల ద్వారా బంధుమిత్రులకు పంపించడం, కెమెరా మెలుకువలు తెలుసుకోవడం, ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించడం, కెమెరా/ఫోటోగ్రఫీ కళ/నైపుణ్యం/సైన్స్/చరిత్రను తెలుసు కోవడం లాంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చు. 2017లో ప్రపంచవ్యాప్తంగా 1.2 ట్రిలియన్ డిజిటల్ ఫోటోలు అందుబాటులో ఉన్నాయని అంచనా. కెమెరా ప్రాధాన్యతను గుర్తించి అవసర సందర్భాలలో పలు వేడుకలు/సమావేశాలు/ సభలు/సంఘటనలు/ ప్రకృతి రమణీయతలు/పండుగలు/ సంస్కృతులు మొదలైన చిరస్మరణీయ సన్నివేశాలను బంధించే సదవకాశాలను అందిపుచ్చుకోవడానికి మనందరం ప్రయత్నిద్దాం.



– డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఇసుక అక్రమ రవాణాను తక్షణమే అరికట్టాలి




మహబూబ్‌నగర్,జూన్ 28: ఇసుక అక్రమ రవాణాను తక్షణమే అరికట్టాలని జిల్లా కలెక్టర్ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయం నుంచి ఇసుక సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మన ఇసుక వాహనం ద్వారా తప్ప ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు లేవని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు ఇవ్వటం లేదని, అయినప్పటికీ జిల్లాలోని కొన్ని ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

ఇకపై జిల్లా నుంచి పిడికెడు ఇసుక కూడా అక్రమంగా రవాణా కావటానికి వీలు లేదని అన్నారు. కేవలం మన ఇసుక వాహనం అనుమతి ఉన్న ఇసుక మాత్రమే రవాణా చేయాలని,అలా కాదని ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే తక్షణమే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇసుక సరఫరా కోసం " మన ఇసుక వాహనం" యాప్ ద్వారా, టీఎస్ ఎంఐడీసీ ద్వారా, ప్రభుత్వ నిర్మాణాలకు, గృహ నిర్మాణాలకు మూడు రకాల అనుమతులు ఇస్తున్నామనిత తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా కాకుండా చూడటంలో తహసీల్దార్లు పూర్తి పట్టు కలిగి ఉండాలన్నారు. పోలీసు రెవెన్యూ అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అదేవిధంగా బాలానగర్, రాజాపూర్, మహబూబ్‌నగర్ రూరల్ తదితర ప్రాంతాల నుంచి ఫిల్టర్ ఇసుక రవాణా అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దీనిని కూడా తక్షణమే నిరోధించాలన్నారు.

లేనట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆర్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకుఎస్సైలు, తహసీల్దారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

# పల్లె ప్రగతిలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి : మంత్రి గంగుల



కరీంనగర్ జూన్ 28(నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలుచేస్తున్న పల్లె, పట్టణ ప్రగతి, హరితహారం కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. జూలై 1 నుంచి 10 వతేది వరకు నిర్వహించే పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, తెలంగాణకు హరితహారం కార్యక్రమాల అమలుపై సోమవారం కరీంనగర్ వి కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సన్నాహక సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పల్లెలు పట్టణాలుగా మారాలని పట్టణాలు ఆధునీకరణ చెంది బంగారు తెలంగాణ నిర్మాణం కావాలన్నారు.

పల్లె, పట్టణ ప్రజలు అందరూ ఆరోగ్యంగా సంతోషంగా జీవించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ పల్లె ప్రగత, పట్టణ ప్రగతి, తెలంగాణకు హరితహారం కార్యక్రమాలను ప్రవేశపెట్టారని మంత్రి తెలిపారు . పల్లె, పట్టణ ప్రగతి లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం నేరుగా స్థానిక సంస్థలకు నిధులు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య పనులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి గ్రామాలలో పారిశుద్ధ్య పనులను ప్రతిరోజు ముమ్మరంగా నిర్వహించేలా చేపట్టిన చర్యలవల్ల ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటున్నారని తెలిపారు.

పల్లె ప్రగతి ,పట్టణ ప్రగతి ,హరితహారం కార్యక్రమాల అమలుపై మంగళవారం మండల స్థాయిలో ప్రజా ప్రతినిధులు అధికారులతో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాలకు మంజూరు చేసిన వైకుంఠ ధామల నిర్మాణ పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

పల్లె ప్రగతిలో గ్రామాలలో ప్రమాదకరమైన పాత బావులను గుర్తించి పూడ్చి వేయాలని, రోడ్లపై నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం హరితహారంపై ముద్రించిన పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ భాను ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ కె .శశాంక, మానకొండూరు, చొప్పదండి శాసనసభ్యులు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, నగర మేయర్ వై .సునీల్ రావు, సుడా చైర్మన్ జీ.వి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

వరంగల్ అర్బన్,జూన్ 28: జిల్లాలోని కమలాపూర్ మండలం గుండేడు గ్రామానికి చెందిన 200 మంది టీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గులాబీ పార్టీలో చేరగా..పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ముఖ్యమం త్రి కేసీఆర్ ఆదేశాల మేరకు కమలాపూర్ మండల ఇన్‌చార్జి ఎమ్మెల్యేగా పనిచేస్తున్నానని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం లక్ష్మీగణపతి ఫంక్షన్ హాల్ పార్టీ కార్యాలయంగా కొనసాగుతుందని తెలిపారు.గ్రామాల్లో నెలకొన్న పనులను రెండు నెలల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ కమలాపూర్ అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి చేస్తున్న కేసీఆర్‌కు ప్రజలు అండగా నిలువాలని కోరారు.కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సంపత్‌రావు, వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం కన్వీనర్ సంపత్‌రావు, సర్పంచ్‌లు విజేందర్‌రెడ్డి, మాట్ల రవిందర్, నాయకులు పింగిళి ప్రదీప్‌రెడ్డి, కట్కూరి తిరుపతిరెడ్డి, లక్ష్మణ్‌రావు, నవీన్‌కుమార్ తదితరులున్నారు.

# నాకు తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం: షర్మిల

హైదరాబాద్ , జూన్ 28:ఏపీ, తెలంగాణ మధ్య నెలకొన్న జలవివాదంపై వైఎస్ షర్మిల స్పందించారు. తనకు తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని ఆమె స్పష్టం చేశారు. 'ఈమె తెలంగాణ కోసం నిలబడుతుందా? ఈమె తెలంగాణ కోసం పోరాడుతుందా? తెలంగాణకు అన్యాయం జరిగే ప్రాజెక్టులను అడ్డుకుంటుందా? అని చాలామంది అనుకుంటుండొచ్చు. మాట మీద నిలబడే రాజన్న బిడ్డగా చెబుతున్నా? తెలంగాణకు దక్కాల్సిన ఒక్క నీటి చుక్కను కూడా వదులుకోం. తెలంగాణకు అన్యాయం జరిగే ఏ ప్రాజెక్టునైనా, ఏ పనినైనా నేను అడ్డుకుంటా. తెలంగాణ ప్రజల కోసం నిలబడతా. తెలంగాణ ప్రజల కోసం ఎవరితోనైనా కొట్లాడతా' అని షర్మిల వ్యాఖ్యానించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.